క్లుప్తంగా

చెరుకుమిల్లిలో ఉచిత వైద్య శిబిరం



మందులు పంపిణీ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ నందమూరి ప్రకాశం

ఆకివీడు: పేదలకు అందుబాటులో వైద్యం అందజేసే విధంగా ఉచిత వైద్య శిబిరాలు దోహదపడతాయని సర్పంచ్ నందమూరి ప్రకాశం అన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పల్లెలో వైద్య శిబిరాలు ఏర్పాటుతో ప్రజలకు ఆరోగ్యం అందుబాటులో ఉంటుందన్నారు. వైద్యులు సమ్మెలో ఉన్నప్పటికీ ప్రైవేటు వైద్యురాలితో ప్రజలకు వైద్యం అందజేయిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో కంటి వైద్యం, బీపీ, సుగర్ పరీక్షలు, మహిళలకు గర్భకోశ వైద్యం అందజేసినట్లు చెప్పారు. శిబిరంలో 180 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సైదాల సూర్యనారాయణ, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలి



స్థానిక సీహెచ్‌సీలో వృద్ధుల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆకివీడు: వృద్ధులు, శరీరక, మానసిక రుగ్మతలకు దూరంగా ఉండాలని సీహెచ్‌సీ సూపరింటిండెంట్ ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. స్థానిక సీహెచ్‌సీలో ప్రపంచ వృద్ధుల దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధులు సంపూర్ణ ఆరోగ్యంపై జాగ్రత్తలు వహించాలన్నారు. ఎప్పటికప్పుడు బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించుకుని, మందులు మానకుండా వాడాలన్నారు. తగిన సమయంలో మందులు వాడాలన్నారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్య సమస్యలు తలెత్తితే వెంటనే దగ్గరలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడమాయోలజిస్ట్ గాతల సుభాష్, ఫిజియోథెరపిస్ట్ ప్రసన్న, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్కీమ్ కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు గోపాలన్

ఆకివీడు: స్కీమ్ కార్మికులకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జెఎన్‌వీ గోపాలన్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు చేసిన వాగ్దానాల్ని తుంగలో తొక్కిందన్నారు. కార్మికులపై ఒత్తిడి తీసుకువచ్చే చర్యల్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల అదనపు పని గంటలు, కార్మిక వ్యతిరేక విధానాల్ని కార్మికులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీ.రాంబాబు, పెంకి అప్పారావు, నంగెడ్డ కొండ, తమ్మిశెట్టి కృష్ణ, గండేటి ఈశ్వరరావు, రామలక్ష్మి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చేనేత, ఖాదీ వస్త్రాలపై అవగాహన



భీమవరంలో చేనేత, ఖాదీ వస్త్రాలపై అవగాహన ప్రదర్శన దృశ్యం


భీమవరం: నేడు విదేశీ వస్తువులపై మోజుపడి స్వదేశీ వస్తువులను విస్మరిస్తున్నామని మన వనరులను మనమే వినియోగించుకోవాలని ఆర్యవైశ్య రాష్ట్ర మహాసభ మాజీ అధ్యక్షుడు వబిలిశెట్టి కనకరాజు అన్నారు. భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో బుధవారం ఖాదీ, చేనేత వస్త్రాలయం వద్ద శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో చేనేత, ఖాదీ వస్త్రాలపై అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఖాదీ చేనేత వస్త్రాలు మనిషికి హుందాతనాన్ని అందిస్తాయని, మహిళలు ఖాదీ చేనేత వస్త్రాలు ధరించడం వల్ల భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు స్పష్టంగా కనిపిస్తాయన్నారు. కేంద్రం చేపట్టిన జీఎస్టీ సంస్కరణతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, అరేటి ప్రకాష్, కంతేటి వెంకటరాజు, బొండా సుబ్బారావు, గంధం శ్రీదేవి, భట్టిప్రోలు శ్రీనివాసరావు, అద్దగర్ల ప్రభాకర్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం!

- సచివాలయాలపై కత్తికట్టిన కూటమి సర్కార్
- సిబ్బందికి సర్వే పనుల అప్పగింత
- ఆగిన పౌర సేవలు
- మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్న జనం

ప్రజలకు స్థానికంగానే అన్ని ప్రభుత్వ సేవలు అందించేలా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చింది. తద్వారా ప్రజలు మండల కేంద్రాలకు వెళ్లే అవకాశం లేకుండా సత్వరం సేవలు అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కంకణం కట్టుకుంది. సిబ్బందికి పలు సర్వే పనులు అప్పగించింది. దీంతో కార్యాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పలు పనుల కోసం వచ్చే ప్రజలు మళ్లీ మండల కేంద్రంలోని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. సర్టిఫికెట్ల కోసం మీసేవా కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

పాలకోడేరు: నియోజకవర్గంలో మొత్తం 72 సచివాలయాలు ఉన్నాయి. 720 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. వారిలో గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శి సాధారణ పరిపాలనతో పాటు గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర పనులు చూసేవారు. డిజిటల్ అసిస్టెంట్ 540రకాల సేవలకు సంబంధించి కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడంతో పాటు డాక్యుమెంటేషన్, అవసరమైన సర్టిఫికెట్ల జారీ పనులు చేసేవారు. వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రభుత్వ పథకాల అమలు, బడుల్లో మధ్యాహ్న భోజనం పర్యవేక్షణ, గ్రామంలో శానిటేషన్ పనులు చేసేవారు. సెరికల్చర్, అగ్రికల్చర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ఆయా శాఖల అధికారులకు సహాయకులుగా ఉంటూ రైతు సేవా కేంద్రాల్లో రైతులకు సేవలు అందించేవారు. ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తల సాయంతో ప్రజలకు వైద్య సేవలు అందించేవారు. విలేజి సర్వేయర్ మండల సర్వేయర్‌కు సహాయకులుగా ఉండే వారు. అనిమల్ హెస్బెండరీ అసిస్టెంట్ పాడి రైతులకు సేవలు అందించేవారు.



సిబ్బంది లేక ఖాళీగా ఉన్న మండలంలో ఒక సచివాలయం(ఫైల్)

సిబ్బందికి సర్వేల పనులు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయాల్లో 540సేవలు ఆపేశారు. ప్రస్తుతం పింఛన్ల పంపిణీ, మంచి ప్రభుత్వం కరపత్రాల పంపిణీ, పీ–4సర్వే, వర్క్‌ఫ్రంహోమ్, మనమిత్రపై అవగాహన, ఈకేవీసీ ఆప్‌డేట్, కౌశలం, హౌస్‌హోల్డ్ జియోటాగింగ్, ఆధార్‌తో బ్యాంకు ఖాతాలు లింక్, ఇంటింటా ఆరోగ్య సర్వే, స్వర్ణ పంచాయతీ డేటా ఎంట్రీ, ఆర్‌టీఎఫ్, ఎంటీఎఫ్, పాఠశాలల విజిట్, టాయ్‌లెట్ల ఫోటోల ఆప్‌లోడింగ్

నిర్దిష్టమైన జాబ్‌చార్ట్‌ను అమలు చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మాకు రకరకాల సర్వేల పేరుతో ఒత్తిళ్లకు గురిచేస్తున్నారు. సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ మాత్రమే ఉంటారు. గతంలో అందిస్తున్న సేవలు ఇప్పుడు లేవు. దీనిపై ప్రభుత్వం ఆలోచించి తగు నిర్ణయం తీసుకోవాలి. మాకు రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు చూడాలి.

యడ్ల సురేష్ సచివాలయం ఉద్యోగుల జిల్లా కన్వీనర్

సచివాలయ వ్యవస్థ నాశనమైంది



గత ప్రభుత్వంలో జనానికి ఏ పని అయినా సచివాలయంలో ఉచితంగా గంటలో జరిగేది. కూటమి పాలనలో సచివాలయ వ్యవస్థ నాశనమైంది. సేవలు లేవు. సీఎస్‌సీ, మీసేవా సెంటర్లకు వెళ్లి సేవలను డబ్బులు కట్టి చేయించుకోవాల్సి వస్తోంది. ప్రభుత్వాలు ప్రజలకు మేలు చేయాలిగానీ ఇబ్బందులు పెట్టడం కరెక్ట్‌కాదు.

మద్దుల జగన్మోహన్ రావు, మోగల్లు

మహాత్మాగాంధీ జయంతోత్సవాల్లో భాగంగా శాంతి ర్యాలీ



భీమవరం శాంతిర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం: మహాత్మాగాంధీ జయంతోత్సవాల్లో భాగంగా సర్వోదయ మండలి, ఏపీ గాంధీ స్మారక నిధి, క్విట్ ఇండియా స్థూప కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం పట్టణం శ్రీరాంపురంలోని గాంధీ కస్తూరిబా మహిళ కేంద్రంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత సేవా సంస్థ అధ్యక్షుడు కె రామకృష్ణరాజు మాట్లాడుతూ జయంతోత్సవాలు సందర్భంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో విద్యార్థులకు గాంధీజీ బోధనలు వాటి ఆశయాలపై వివిధ పోటీలను నిర్వహించి 6 గురికి అవార్డులు అందించామన్నారు. అనంతరం గాంధీజీ విగ్రహంతో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంతెన రామలింగరాజు, ఎం జాన్సీలక్ష్మి, రత్నమాల, జిల్లా సర్వోదయ మండలి కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు, చెరుకువాడ రంగసాయి, బుద్దరాజు వెంకటపతిరాజు, కలిగొట్ల గోపాల శర్మ, ఎస్ సత్యనారాయణరాజు, గురుప్రసాద్, ఎస్‌కె చాన్‌భాషా తదితరులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దనీగా అమ్మవారి దర్శనం



ఆకివీడు: రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం



భీమేశ్వరస్వామి దేవస్థానంలోని మహిషాసురమర్దినీ అమ్మవారు



తీగలదొడ్డిలోని పెద్దింటి అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి



కాళ్ళకూరు వెంకటేశ్వర స్వామి ఆలయంలో మహాలక్ష్మి అలంకరణలో



మహిషాసురమర్దినీగా ఆకివీడు పెద్దింటి అమ్మవారు



పంచారామక్షేత్రంలో మహిషాసురమర్దినీగా పార్వతీదేవి



గాజుల అలంకరణలో అన్నపూర్ణా అమ్మవారు



కనకదుర్గమ్మకు విశేష పూజలు చేస్తున్న దృశ్యం

- అమ్మవారి దర్శనానికి క్యూ కట్టిన భక్తులు
- ఉదయం నుంచి ఆలయాల్లో కుంకుమ పూజలు

ఆకివీడు: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని మహిషాసురమర్ధిని అలంకరణలో భక్తులు పూజించారు. స్థానిక పెద్దింటి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. స్థానిక రాజరాజేశ్వరి సహిత మార్కండేయేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి 293 తాంబూళాలతో ప్రత్యేక పూజలు చేసి, సువాసినిలకు అందజేశారు. అనంతరం ఆలయ కార్యదర్శి కాకర్ల రాజ రాజేశ్వరి, మోరా జ్యోతిరెడ్డి, పలువురు మహిళలు హోమం చేశారు. స్థానిక తీగలదొడ్డిలోని పెద్దింటి అమ్మవారికి నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మహిళలు జలాభిషేకం చేశారు. అయిభీమవరంలోని కనకదుర్గమ్మకు మహిళలు బిందెలతో తీసుకువచ్చిన పసుపు నీళ్లతో జలాభిషేకం చేశారు.

మహాలక్ష్మి అలంకరణలో..

కాళ్ల: దసరా మహోత్సవాల్లో భాగంగా కాళ్ళకూరు గ్రామంలో వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 10వ రోజు బుధవారం మహాలక్ష్మి అమ్మవారిగా శ్రీలక్ష్మి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా అమ్మవారికి కుంకుమపూజలు, అష్టోత్తర శతనామార్చన, ఆలయ ప్రదక్షిణము ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున భక్తులు, గ్రామస్తులు పాల్గొని శ్రీ అమ్మవారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎం .అరుణ్ కుమార్ తెలిపారు.

ఘనంగా దసరా ఉత్సవాలు



మెంటేవారి తోటలో 108 కలశాలతో గ్రామోత్సవం

వీరవాసరం: దేవి శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా మండల వ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆలయాల్లో బుధవారం పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వీరవాసంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలోనూ, తోలేరులో శ్రీ ప్రసన్న కనకదుర్గాదేవి ఆలయంలోనూ, రాయకుదురు, కొనితివాడ, మడుగు పోలవరం, అండలూరు, తోలేరు, చింతల కోటి గరువు, మత్స్యపురిపాలెం, మత్స్యపురి, బాలేపల్లి, మెంటేపూడి, దూసనపూడి, పెరికిపాలెం తదితర గ్రామాల్లో అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక కుంకుమ పూజలు పెద్ద ఎత్తున నిర్వహించారు. అమ్మవారిని మహిషాసుర మర్దినీగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారని ఉత్సవ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో శంకరమంచి రఘు, కొడమంచిలి ప్రసాద్, సూర్య సంతోష్, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ విలవెల్పు మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో దేవిశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా 10వరోజైన బుధవారం మావుళ్లమ్మ అమ్మవారు మహిషాసురమర్దినీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లిఖార్జున శర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మీ నగేష్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పంచారామక్షేత్రంలో

పంచారామక్షేత్రం ఉమాసోమేశ్వర జనార్ధన స్వామి దేవస్థాంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో బుధవారం పార్వతీదేవి అమ్మవారు మహిషాసురమర్దినీగా ప్రత్యేక అలంకరణ చేశారు. అలాగే ఆలయంలో కొలువైన అన్నపూర్ణదేవికి ప్రత్యేక గాజుల అలంకరణ నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవార్లుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి డి.కృష్ణంరాజు ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.

భీమేశ్వర స్వామి వారి దేవస్థానంలో

భీమేశ్వరస్వామి దేవస్థానంలో కొలువైన మహిషాసురమర్దినీ అమ్మవారి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి తోటశ్రీనివాస్, ఆలయ అర్చకులు సిబ్బంది పాల్గొన్నారు.మెంటేవారి తోటలో బాలా త్రిపురసుందరీదేవి అమ్మవారికి బుధవారం 108 కలశాలలతో మహిళలు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. అర్చకులు కొమ్ము శ్రీనివాస్ ప్రత్యేక పూజలను నిర్వహించారు.

దుప్పట్ల పంపిణీ

ఆకివీడు: దైవంతో సమానమైన తల్లిదండ్రులను ఆదరించి, ప్రేమించి, వారి శ్రేయస్సుకు దోహదపడాలని వృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బొబ్బిలి బంగారయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా స్థానిక లయన్స్ కార్యాలయంలో బుధవారం వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనల్ని కని, పెంచి పెద్ద వాళ్లను చేసి ప్రయోజకుల్ని చేసిన తల్లిదండ్రులిని వృద్ధాప్యంలో వదిలివేయడ సరికాదన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు పల్లి అప్పిరెడ్డి, ఆర్థిక సహకారంతో 100 మంది వృద్ధులకు దుప్పట్లు, భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడవి సుబ్బారావు, పేర్ల ప్రసాద్, కొల్లి సుబ్బారెడ్డి , కాకర్ల నర్సింహమూర్తి, దండురామ కృష్ణంరాజులను సత్కరించారు. లయన్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ఆగిన సేవలు

- విధులను బహిష్కరించిన డాక్టర్లు
- సేవలు అందక రోగుల ఇక్కట్లు
- కూటమి ప్రభుత్వంపై భగ్గుమంటున్న ప్రజలు

వీరవాసరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యసేవలు నిలిచిపోయాయి. ఇప్పటికే ఆరోగ్యశ్రీ నిలిచిపోగా తాజాగా డాక్టర్ల సమ్మెతో గ్రామీణ ప్రాంతాల్లో వైద్యం కరువైంది.పీహెచ్‌సీలలో పనిచేస్తున్న డాక్టర్ల న్యాయమైన డిమాండ్ల సాధనతో పాటుగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ డాక్టర్లు సమ్మెబాట పట్టారు. రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీరవాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌సీ వైద్యులు విధులకు హాజరు కాకుండా నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో రోగులు పలు ఇబ్బందులు పడుతున్నారు.



వైద్యం కోసం వేచియున్న రోగులు

తల్లిదండ్రులను చూడాల్సిన నైతిక బాధ్యత పిల్లలదే

భీమవరం: తల్లిదండ్రులను సక్రమంగా చూడాల్సిన నైతిక బాధ్యత పిల్లలపై ఉంటుందని భీమవరం ఒకటవ అదనపు సివిల్ జడ్జి పి హనీష అన్నారు. మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వృద్ధుల దినోత్సవం సందర్భంగా తాడేరు రోడ్డులోని వృద్ధుల ఆశ్రమంలో నిర్వహించిన న్యాయ అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కని, పెంచి, విద్యాబుద్ధులు నేర్పించిన తల్లిదండ్రులకు పిల్లలు ఉన్నా వృద్ధాశ్రమంలో గడపాల్సి రావడం చాలా బాధాకరమన్నారు. తల్లిదండ్రులను పట్టించుకోని పిల్లల నుంచి మనోవర్తి కోరవచ్చునని వృద్ధుల హక్కుల పరిరక్షణకు మండల న్యాయ సేవా సంస్థను సంప్రదించవచ్చునన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి న్యూటన్, ప్యానల్ న్యాయవాదులు ఎంబీభవాని, డిరవికిరణ్, 1వ పట్టణ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎం నాగరాజు, పారా లీగల్ వలంటీర్ కె చంద్రరావు, వృద్ధాశ్రమం నిర్వాహకుడు సత్యనారాయణరాజు, రవి పాల్గొన్నారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన ర్యాలీ

పాలకోడేరు: జీఎస్టీ సంస్కరణల ఫలాలు ప్రతి కుటుంబానికి అందించాలని సూపర్ జీఎస్టీ–సూపర్ సేవింగ్స్ కార్యక్రమాల నిర్వహణ ప్రధాన ఉద్దేశ్యమని వక్తలు తెలిపారు. పాలకోడేరు మండల కేంద్రంలో అధికారులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో జీఎస్టీపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ ఎన్. భారతి విజయలక్ష్మి, ఎంపీడీవో వి. రెడ్డయ్య, ఏ.ఓ.సంధ్య, మండల పశు వైద్యాధికారిణి హేమ, ఇతర అధికారులు, సొసైటీ అధ్యక్షుడు కొత్తపల్లి నాగరాజు, డెల్టా వాటర్ డిస్ట్రిబ్యూషన్ చైర్మన్ కునాథరాజు మురళీ కృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ విజయలక్ష్మి, తదితరులు